క్లుప్తంగా

నేటి నుంచి పాఠ్యపుస్తకాల పంపిణీ

పెద్దేముల్: పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు ప్రభుత్వం సరఫరా చేసిందని, వాటిని గురువారం నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తామని మండల విద్యాధికారి వెంకటయ్య బుధవారం తెలిపారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, అప్పటిలోగా అన్ని బడులకు అందజేస్తామని పేర్కొన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు యూనిఫామ్స్ వచ్చాయని, వాటినీ అంద జేయనున్నట్లు ఎంఈఓ వెల్లడించారు.

మహాదేవుని ఆలయంలో పూజలు



స్వామి సన్నిధిలో భక్తులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో బుధవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9గంటల నుంచి ఆలయ ఆవరణలో లింగాష్టక పారాయణం, 12.30 గంటలకు శివ లింగానికి అభిషేకం చేశారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకం చేశారు. బిల్వాష్టకం, లింగాష్టకం, శివాష్టోత్తర శతనామావళి, ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ మంగళహారతులు పట్టారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

'కొండా'ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డితో ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు రూరల్: చేవెళ్ల ఎంపీగా గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా మాట్లాడారు. తన గెలుపునకు కృషి చేసిన వారందరికీ అభినందనలు తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంటులో బీజేపీ తరఫున కృషి చేస్తానని ఎమ్మార్పీఎస్ నాయకులకు హామీ ఇచ్చారు. కొండాను కలిసిన వారిలో మల్లికార్జున మాదిగ, ప్రకాష్, నర్సింలు మాదిగలు తదితరులు ఉన్నారు.

రోడ్డుపై గుంత.. ఆదమరిస్తే చింత



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

దుద్యాల్: మండల కేంద్రం నుంచి అల్లిఖాన్‌పల్లికి వెళ్లే రహదారిలో పెద్ద గుంత ఏర్పడి, ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం గుండా నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, చిన్నారులు ఆడుకుంటారని స్థానికులు తెలిపారు. పిల్లలు అందులో పడే అవకాశముందని, వాహనదారులు ఏ మాత్రం ఆదమరచినా ప్రమాదం బారిన పడతారని పేర్కొన్నారు. గతంలో కొందరు వాహనదారులు గుంత కారణంగా ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి, ఆ గుంతను పూడ్చించాలని కాలనీ వాసులు కోరారు.

జర్నలిస్టుకు పరామర్శ

తాండూరు టౌన్: బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బషీరాబాద్ మండలానికి చెందిన జర్నలిస్టు సైమండ్స్‌ను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. సైమండ్స్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆర్థిక సహాయం అందజేశారు. వైద్య ఖర్చులను సీఎంఆర్ఎఫ్ ద్వారా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో బషీరాబాద్ మండల పీఏసీఎస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ హన్మంతు, టీయూడబ్ల్యూజె (ఐజెయూ) జర్నలిస్టులు రాంరెడ్డి, శివకుమార్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి

నందిగామ: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ సుమతి గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రమైన నందిగామలో బుధవారం జీపీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, మురికికాల్వలను శుభ్రం చేయాలన్నారు.

నిత్యం సాహసమే..



అన్నారం వాగు జల ప్రవాహం దాటలేక ఒడ్డున నిల్చున్న తండా యువతులు(ఫైల్)



వాగు దాటేందుకు యత్నిస్తున్న తండా వాసులు(ఫైల్)

ఊరు దాటాలంటే.. వాగు దాటాల్సిందే..

- 'అన్నారం' జలప్రవాహంతో తండా వాసుల తంటా
- వానాకాలం వచ్చిందంటే.. భయం గుప్పిట్లో గిరిజనులు

యాలాల: చుట్టూ అటవీ ప్రాంతం.. కంకర తేలిన కాలిబాట, మధ్యలో వాగు ఆ గిరిజనుల రహదారి. వానాకాలం వచ్చిందే.. ఆ తండావాసులు 'అన్నారం'జల ప్రవాహంతో సావాసం చేయాల్సిందే. బయటి వారు ఈ ఊరికి రావాలన్నా.. ఇక్కడి వారు పొరుగూరుకు వెళ్లాలన్నా.. మార్గమధ్యలోని వాగు గండం నుంచి గట్టెక్కాల్సిన దుస్థితి. ఏటా ఇదే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నప్పటికీ.. పరిస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని పటేల్‌చింత తండా గిరిజనులు ఆందోళన వ్యక్తచేస్తున్నారు. అత్యవసరమైనా ఉధృతంగా ప్రవహిస్తున్న జల ఖడ్గాన్ని ఛేదించాల్సి ఉంటుందని వాపోతున్నారు. ఒకవేళ ఈ గండం గట్టెక్కినా.. జుంటుపల్లి ప్రాజెక్టు అలుగును అధిగమించాల్సిందేనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మా కష్టాలు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

అన్నారం వాగుపై..

పటేల్‌చింత నుంచి పొరుగూరికి వెళ్లేందుకు ఉన్న మార్గంలో అన్నారం వాగుపై లో లెవెల్ కాజ్‌వే నిర్మిస్తే తాత్కాలిక పరిష్కారం దొరుకుతుందని తండావాసులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు దృష్టి సారించి, సమస్యను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

వంద మంది జనాభా

యాలాల మండల పరిధి రేళ్లగడ్డతండా పంచాయతీ అనుబంధ పటేల్‌చింతతండా జనాభా సుమారు వంద మంది. 50 మంది ఓటర్లున్నారు. వీరిలో 8 మంది కళాశాల విద్యనభ్యసిస్తుండగా.. 15 మంది ఉన్నత విద్య కోసం తండా నుంచి పగిడిపల్లి మీదుగా సమీప గ్రామాలకు వెళ్తుంటారు. అయితే వానాకాలం వస్తుందంటే గిరిజనుల గుండెల్లో గుబులు పుడుతోంది. ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ఉంటాయన్న వాతావరణ శాఖ ప్రకటనతో ఆందోళన నెలకొంది. చిన్నపాటి వర్షానికి పగిడిపల్లి–తండా మధ్య ఉన్న అన్నారం వాగులో ఎగువ నుంచి వరద చేరి ఉధృతంగా ప్రవహిస్తూ.. జుంటుపల్లి ప్రాజెక్టులో చేరుతుంది. ఈ ప్రవాహం మధ్యలో నుంచి తండాకు వెళ్లే మార్గం ఉండటంతో ఇక్కడి ప్రాంత వాసులు.. ఏటా ప్రవాహంతో సాహసం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.



పటేల్‌చింతతండా

భయం భయంగా..



వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో భయభయంగా ఉంది. ఎవరికైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే.. వారి ప్రాణాలు గాలిలో కలవాల్సిందే. అన్నారం వాగుపై వంతెన నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నాము. నివేదికలు ఇచ్చాము. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే.. వెన్నులో వణుకుపుడుతోంది.

– భీం నాయక్, పటేల్‌చింతతండా

చందాలు వేసుకుని.. కోతులను బంధించి

అటవీ ప్రాంతానికి తరలించిన గ్రామస్తులు



బోనుకు చిక్కిన కోతులు

తాండూరు రూరల్: కోతుల బెడద నుంచి రక్షించండి మహాప్రభో అని అటవీశాఖ అధికారులను వేడుకున్నారు ఆ గ్రామస్తులు. కానీ వారు చేతులెత్తేశారు. దీంతో స్థానికులందరూ చందాలు వేసుకున్నారు. వలపన్ని భారీ సంఖ్యలో వానర గుంపులను బంధించారు. ఆపై అటవీ ప్రాంతాలకు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు మండల పరిధి కోటబాసుపల్లి గ్రామంలో కొంత కాలంగా వానర సైన్యం వీరావిహారం చేస్తోంది. పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉల్లి పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగించడంతో పాటు.. ఊరిపై పడి ఇళ్ల పీకి పందిరి వేస్తున్నాయి. వాటి నుంచి కాపాడండి అని రైతులు, మండల వైస్ ఎంపీపీ స్వరూప వెంకట్రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వీరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మహేందర్, మాజీ సర్పంచ్ నాగార్జున తదితరులు అటవీ అధికారులను కోరగా.. తమకు సంబంధం లేదని, సొంతంగా డబ్బులు వేసుకుని, వాటిని పారదోలుకోవాలని అధికారులు సలహా ఇచ్చినట్లుగా వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు చందాలు వేసుకుని, కోతులు పట్టే వారిని గ్రామానికి రప్పించారు. స్థానిక హనుమాన్ దేవాలయం పెద్ద బోన్లను ఏర్పాటు చేసి, అందులో వాటికి ఆహారంగా మొక్కజొన్న, వేరుశనగ తదితర ఫలాలను ఉంచారు. దీంతో పెద్ద సంఖ్యలో కోతులు వలకు చిక్కగా.. వాటిని తెలంగాణ–కర్ణాటక సరిహద్దు షాదిపూర్ అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు వీరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారుల తీరుపై గ్రామస్తులు అసహనం వ్యక్తంచేశారు.

నిర్లక్ష్యమే.. రోడ్డు ప్రమాదాలకు కారణం

- మద్యం తాగి వాహనాలు నడపొద్దు
- ఏఎస్ఐ సూర్యనారాయణ



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దోమ: రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం వలనే జరుగుతున్నాయని ఏఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్ఐ ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు శాంతిభద్రతలు, రోడ్డు ప్రమాదాల గురించి పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రోడ్డు ప్రమాదాల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. చిన్న చిన్న తగాదాల వలనే గొడవలు జరుగుతున్నాయని, తీవ్ర ఆవేశాలకు లోనై.. గొడవలు పడి, చివరకు నష్టపోతున్నారని ప్రజలకు వివరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ధృవపత్రాలను దగ్గరే ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నర్సింలు, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డుతో.. అవస్థలు



పర్సాపూర్ సమీపంలో రోడ్డు దుస్థితి

దుద్యాల్: ఆరు నెలల క్రితం ప్రారంభించిన రోడ్డు పనులు పూర్తికాక.. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ నుంచి కోస్గి, కొడంగల్ మీదుగా కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు నూతనంగా రోడ్డు నిర్మాణ పనులు గతంలో చేపట్టారు. కానీ.. వానాకాలం వచ్చినా రహదారి నిర్మాణ పనులు పూర్తి కాలేదు. భూత్పూర్ నుంచి దుద్యాల్ గేట్ వరకు రోడ్డు పూర్తయింది. గేట్ నుంచి కొడంగల్ మండలం పర్సాపూర్ శివారు వరకు ఒక వైపు రహదారి నిర్మించారు. కానీ.. అది కూడా మధ్యలోనే ఆపేశారు. అక్కడి నుంచి కొడంగల్ వరకు ఒక వైపు కంకర పోసి వదిలిపెట్టారు. దీంతో గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తోంది. ఈ మార్గం గుండా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా.. అసంపూర్తి రోడ్డు పనులతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డులో నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. వానలు విస్తృతం కాకముందే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని పరిసర ప్రాంత ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రాష్ట్రంలో బీజేపీకే భవిష్యత్తు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



డీకే అరుణను సన్మానించిన నాయకులు

షాద్‌నగర్: భవిష్యత్‌లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీగా విజయం సాధించిన డీకే అరుణను బుధవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యల ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు. ఎంపీ అరుణకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీజేపీతోనే పాలమూరు ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ప్రజలు డీకే అరుణకు పట్టం కట్టారని తెలిపారు. రామరాజ్యం కోసం ప్రజలు డీకేకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కేంద్రంలో అరుణ కీలక పాత్ర పోషించడం ఖాయమన్నారు. భవిష్యత్‌లో తెలంగాణలో కూడా కాషాయం జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో పార్టీ పుంజుకుందన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు మరోసారి పట్టం కట్టారన్నారు. దేపల్లి అశోక్‌గౌడ్, అశోక్, రఘురాం, చెన్నయ్య, రాము, శ్రవణ్, రమేశ్ ఉన్నారు.

నకిలీలు విక్రయిస్తే దుకాణం సీజ్

- రైతులను మోసం చేస్తే.. పీడీయాక్ట్
- కొనుగోలు అనంతరం రసీదు తప్పనిసరి
- వ్యవసాయ అధికారుల హెచ్చరిక
- ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



మర్పల్లి: ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏఓ వసంత, ఏఎస్ఐ శ్రీనివాస్

మర్పల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలతో పాటు, దుకాణాలను సీజ్ చేస్తామని ఏఓ వసంత వ్యాపారులను హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్, ఆగ్రో, మనగ్రోమర్, విత్తనాల దుకాణాలను ఏఎస్ఐ శ్రీనివాస్‌తో కలిసి ఆమె తనఖీ చేశారు. విత్తనాల సంచులు, స్టాక్ రిజిస్టర్, విత్తన కంపనీల రసీదులను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడారు. వానాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారని, వారికి అవసరమైన నాణ్యతతో కూడిన విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందులను విక్రయించాలని దుకాణ దారులకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పత్తి, ఇతరత్రా విత్తనాలను అమ్మాలని చెప్పారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి దుకాణంలో ధరల పట్టిక, విత్తనాల స్టాక్ వివరాలను నిత్యం రైతులకు కనిపించే విధంగా బోర్డుపై రాసి ఉంచాలని వెల్లడించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు, లేదా వ్యవసాయ శాఖ అధికారులకు లేదా 100 టాస్క్ ఫోర్స్ అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులను కోరారు.

వివరాల నమోదు తప్పనిసరి

యాలాల: విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన అనంతరం రైతులకు డీలర్ సంతకంతో కూడిన రసీదును తప్పనిసరిగా ఇవ్వాలని వ్యవసాయ విస్తరణ అధికారి యాదగిరి అన్నారు. మండల పరిధి లక్ష్మీనారాయణపూర్‌లో పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఎంఏఓ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మార్కెట్లో వివిధ రకాల కంపెనీల పేరుతో ఉన్న విత్తనాలు హైబ్రిడ్‌వేనని తెలిపారు. ఒకే కంపెనీ విత్తనాలు కావాలంటూ రైతులు దుకాణ దారులను అడగటం వలన డిమాండ్ పెరిగి, ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన వెల్లడించారు. అనంతరం ఆయా షాపుల్లో విత్తన ప్యాకెట్ల వివరాలు, కొనుగోలు చేసిన రైతుల వివరాలను నమోదు చేసిన రిజిస్టర్లను పరిశీలించారు. రైతుల పేరు, ఫోన్ నంబర్‌ను తప్పక నమోదు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మదన్ తదితరులు ఉన్నారు.

రైతులు మోసపోవద్దు



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏఓ

దుద్యాల్: నకిలీ విత్తనాలు విక్రయించి, రైతులను మోసం చేస్తే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఏఓ అనురాధ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. వానాకాలం సీజన్‌లో మాయ మాటలు చెప్పి, నకిలీ విత్తనాలు విక్రయించేవారు గ్రామాలకు అధికంగా వస్తుంటారని, వారిని నమ్మిమోసపోవద్దని రైతులకు సూచించారు. గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. నకిలీ బెడద నుంచి రైతులను రక్షించేందుకు నిరంతరం దుకాణాలను తనిఖీ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ మునీరొద్దీన్ ఉన్నారు.

మొక్కలు జీవకోటికి ప్రాణవాయువు

- పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి
- ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో అధికారులు, ప్రజాప్రతినిధులు



తాండూరు టౌన్: పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న మాజీ చైర్ పర్సన్ విజయలక్ష్మి తదితరులు

తాండూరు టౌన్: మొక్కలు జీవకోటికి ప్రాణవాయువు అని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కొత్రిక విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తాండూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్ రావుతో కలిసి ఖాంజాపూర్ గేట్ సమీపం శ్రీవేంకటేశ్వర దేవాలయం, ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. నేడు నాటిన మొక్కలే మానులై.. జీవకోటికి ప్రాణవాయువును అందించడమే కాకుండా.. పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని చెప్పారు. భూభాగంపై అడవుల శాతం తగ్గితే వర్షాలు పడవని, కాలుష్యం పెరిగి విపత్కర పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్, సామాజిక కార్యకర్త వెంకట్, శ్రీరామకృష్ణ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు గాజుల బస్వరాజ్, రిటైర్డ్ హెచ్ఎం బిచ్చప్ప, బీట్ ఆఫీసర్లు మల్లయ్య, నర్సింలు, ఉపాధ్యాయులు ఫాతిమాబేగం, పుష్పలత, ఝాన్సీ, పద్మ, సుజాత పాల్గొన్నారు.



పూడూరు: సోమన్‌గుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో మొక్క నాటుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి

ప్రకృతిని రక్షించండి

దుద్యాల్: ప్రకృతిని మనం రక్షిస్తే.. అది జీవకోటిని రక్షిస్తుందని తహసీల్దార్ దానయ్య అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా.. తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అడవుల శాతం తగ్గి పరావరణం కాలుష్యం బారిన పడిందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా జీపీ కార్యదర్శి రమేశ్ రాథోడ్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు మొక్కలు నాటారు. మాజీ సర్పంచ్ ఎండీ ఖాజ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు వెంకటయ్య, శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.

ఈర్లపల్లిలో..

మండల పరిధి ఈర్లపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు మొక్కలు నాటారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ రాజప్ప తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరి బాధ్యత

కుల్కచర్ల: మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండల పరిధి బండవెల్కిచర్ల, తదితర గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం తమ బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జహంగీర్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం ఉన్నచోటే ఆహ్లాదం

దోమ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిధి గొన్యానాయక్ తండా అనుబంధ గ్రామమైన కేశిలమ్మతండా పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌తో కలిసి మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం వారు మాట్లాడారు. ఎక్కడ పచ్చదనం ఉంటుందో అక్కడ ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుందని చెప్పారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్నా, ప్రాణవాయువైన ఆక్సిజన్ శాతం పెరగాలన్నా ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి పరిరక్షించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి, సీఆర్‌పీ వెంకటేశ్, సిబ్బంది నజీర్, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు తదితరులు

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దేవర్‌ఫసల్‌వాద్ పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

8,9 తేదీల్లో వన్య మైత్రేయ

బంట్వారం: కోట్‌పల్లి మండలం నాగసాన్‌పల్లి సమీపంలోని క్వాంటం లైఫ్ ఫౌండేషన్‌లో ఈ నెల 8,9వ తేదీన వన్య మైత్రేయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఆచార్య పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫౌండేషన్‌లోని 70 శాతం మేర భూ భాగంలో పచ్చదనం పెంచి, వన్య ప్రాణులకు ఆహార నిలయంగా మార్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. రెండు రోజుల కార్యక్రమంలో వృక్ష సేవ, ధ్యానం ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు ఇందులో పాల్గొనాలని ఆయన కోరారు.

'బడిబాట'ను విజయవంతం చేయండి

బంట్వారం: నేటి నుంచి ఈ నెల 19వ తేదీ వరకు బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో నిర్వహించే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలను ఎంఈఓ చంద్రప్ప బుధవారం ఒక ప్రకటనలో కోరారు. హెచ్ఎంలు.. అందరి సహకారం తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో బడిబయట పిల్లలను గుర్తించడంతో పాటు.. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి, నాణ్యమైన విద్యాబోధన గురించి వివరించి, వారి పిల్లలను సైతం సర్కారు బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలని సూచించారు.